## 7.2.8 అనుభూతి కవిత్వం

భావకతా సంప్రదాయంతో వాస్తవిక జగత్తును సాక్షాత్కరింపజేయాలని ప్రయత్నించిన కవి బాలగంగాధర తిలక్, వీరు అందం, ఆనందం కవితా పరమావధి అనే తాత్త్వాన్ని సమర్థించారు. అనుభూతిని అక్షరబద్ధం చేసిన కవి తిలక్.

"ముసలిదైపోయింది భూమి
మూర్ఖులైన తన కొడుకుల్ని నమ్ముకుని" [1]

కవితామతల్లి కొన్ని వేల యేళ్ళ బరువును మోసింది. గతంలో ఎన్నో సరదాలతో నవజీవన హేలతో ఆశలతో పరవశించింది. నేడు ముసలిదైపోయింది అని వర్తమాన స్థితిని విమర్శించారు. ఇది కలికాలం కలికి కాలం అని వచన కవుల రచనలను ఖండించారు. యుగయుగానికీ స్వభావం మారుతుంది అగుపించని ప్రభావానికి లొంగుతుంది. పైపై మార్పులకే సంస్కృతి నశించిందని అనుకోవటం పొరపాటంటారు తిలక్.

"ఆది నుండి, ద్రవిడ బర్బర యవన తురుష్కహూణులనుండీ,
ఇచ్చినదీ పుచ్చుకున్నదీ ఎంతైనా ఉన్నదనీ,
అయిదు ఖండాల మానవ సంస్కృతి
అఖండ వసుధైక రూపాన్ని ధరిస్తోందనీ, భవిష్యత్ సింహద్వారం
తెరుస్తోందనీ,
గ్రహించలేరు పాపం వీరు
ఆలోచించలేని మంచివాళ్ళు
ఏ దేశ సంస్కృతి అయినా ఏనాడు కాదొక స్థిరబిందువు
నైక నదీనదాలు అదృశ్యంగా కలిసిన అంతస్సింధువు" [2]

---

1, 2. తిలక్, అమృతం కురిసిన రాత్రి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, తొమ్మిదవ ముద్రణ, 1996, పుట 133.



తిలక్ ఆశావాది. వసుధైక కుటుంబం ఆయన స్వప్నం. భిన్న సంస్కృతుల సమాహారం భవిష్యత్తుకు సింహద్వారం సంస్కృతి నిరంతరం మారుతుంటుందని మార్పు దాని నైజమని ఆ మార్పు పైపైకి కనిపించేది కాదని అదృశ్యంగా కొనసాగిపోయేదని వెల్లడించారు. సమాజంలో మార్పు రావటానికి కవికి కూడ ప్రధానపాత్ర ఉందనే అంశాన్ని పలుమార్లు స్ఫురింపజేస్తారు తిలక్. వర్తమానం సుందర అభిసారికలా ఆగామి కోసం ఎదురుచూస్తుందని వర్తమానంలో నిలిచి వసుధైక గీతాన్ని వినిపించారు. కొన్ని సందర్భాలలో గతమంతా తోలు బొమ్మలాడిన ఒక తెరలా, వర్తమానం కన్నులను గప్పిన పొరలా, జీవితం కాలిపోయిన ఇల్లులా, కాలం పాడు నుయ్యిలా, మానవునికి చివరిరోజు అణుబాంబుల వలన వస్తుందని ఒక వైపు భయాందోళనలు వ్యక్తం చేస్తూ మరొకవైపు ఆశాభావాన్ని వ్యక్తం చేసారు. "సంకుచితమైన మానసీయ పతాకను ఎగురవేస్తున్నాడు చూడు" [1] –వసుధైక గీతం.

మానవుడు మానవుడిగా దేవుడిగా రూపొందే ఈ ప్రయాణం అనంత దీర్ఘం. మానవుడిలో స్వార్థం వలన ఆశయాలు, ఆదర్శాలు సమాజ పరిణామానికి తొలగిపోతాయి. అనుభూతి కవిత్వానికి ప్రతినిధి తిలక్.

అఫ్సర్, రవూఫ్, బి.వి.ప్రసాద్, శివలెంక రాజేశ్వరీదేవి అనుభూతి ప్రధానమైన కవితలను రచించారు. ఇస్మాయిల్, మోహన్ ప్రసాద్, కొత్తపల్లి సత్య శ్రీమన్నారాయణ, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ అనుభూతి కవులుగా గుర్తింపబడ్డారు.[2] అవ్యక్తానుభూతిని కలిగిస్తుంది అనుభూతికవిత్వం. బాహ్యాంతర లోకాలను సర్వేక్షిస్తుంది.

---

1. తిలక్, అమృతం కురిసిన రాత్రి, 1996, పుట 70.
2. సంపాదకులు ఎస్వీ. సత్యనారాయణ, ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రక్రియలు, ధోరణులు, తెలుగు అకాడమీ, హైదరాబాదు, 2005, పుట 85.

"గతంలోకీ భవిష్యత్తులోకీ, ఇంట్లోంచి బయటకీ
తిరుగుతూ నాల్క చాచుకుని కాపలా కాస్తుంటాడు
ఇహానికీ పరానికీ చెడుతూ" [1]

ఇంద్రగంటి శ్రీకాంతశర్మ 'త్రికాల బాధితం' కవితలో 'వర్తమానపు విత్తు భవిష్య ద్వృక్షం' అని అంటూనే భూత భవిష్య వర్తమానాల భావం మారదు, స్వభావం మారదు, పదం మారుతుంది, క్రియాపదం మారుతుంది అంతేనని, కాలస్వభావాన్ని వర్ణించారు.

**అనుభూతి నిర్వచనాలు**

[2]. ఆర్.ఎస్. సుదర్శనం

(అనుభూతివాద కవిత్వం – తెలుగులో దేశీయ కవితా ప్రస్థానం).

2. కవిత్వంలో సమగ్ర సామాజిక అనుభవాన్ని పండించాలన్న అత్యంత ఆధునిక సాహిత్య స్పృహతో చేస్తున్న ప్రయత్నమే అనుభూతి వాదం[3] – జి.వి. సుబ్రహ్మణ్యం, (అనుభూతి కవితా వాదం – అభ్యుదయ కవిత్వానంతర ధోరణులు)

---

1. చితి–చింత, వేగుంట మోహనప్రసాద్, కవిసంధ్య,విరివాల్యూమ్స్,2000, పుట 10.
2. సంపాదకుడు, పేర్వారం జగన్నాథం, చైతన్య వేదిక, హైదరాబాద్, 2002, పుట 43–51.
3. సంపాదకుడు, పేర్వారం జగన్నాథం,సాహితీ సమితి, హనుమకొండ, 2003, పుట 241–269.



3. అనుభూతి కవిత్వానికి మానవ అనుభవంతో సంబంధం, అనుభవం అంటే బహిర్లోక అంతర్లోకాల అనుసంధానం. ఈ సమన్వయం ద్వారానే బహిరంతర లోకాలను ఏకకాలంలో అర్థం చేసుకోగలమని అనుభూతి కవిత్వం రుజువు చేస్తుంది. (ఇస్మాయిల్).
4. మనస్సు లోలోపలి అనుభూతులకి అక్షర కల్పన చెయ్యడం అనుభూతి వాదమని, వస్తు స్వరూపాలకూ సంఘర్షణలకూ శక్తులకూ మూలమైన కీలకస్థానం మీద శక్తివంతమైన బ్యాట్రిలైట్ ఫోకస్ చెయ్యడం లాంటిది. (అద్దేపల్లి రామ్మోహనరావు. అనుభూతి వాది తిలక్ – విమర్శ వేదిక).
5. అభ్యుదయ కవిత్వం స్తబ్దతలో ఉన్న దశలో భావ కవిత్వానికి అంతగా భేదం లేకుండా అవతరించిన ధోరణి, అభ్యుదయం తర్వాత విప్లవ కవిత్వానికి ముందు వచ్చింది. అనుభూతి కవిత్వం. బాహ్య ప్రపంచ దృశ్యాలు అంతరంగ ప్రపంచంలో దృశ్యత్వాన్ని కోల్పోయి కేవలం అనుభూతిగా మిగలటమే అనుభూతివాదం.మానవ కారుణ్యావాదం, ఇజాల వ్యతిరేకత, మార్మికత, నేను ప్రాధాన్యం మొదలైన ధోరణుల సముదాయం[1]. (కె.కె. రంగనాథాచార్యులు)
6. నువు చెప్పేదేదైనా నీ అనుభవంలోంచి పలకాలి. 'పాఠకుడికి నీ అనుభూతి ఆకారం అందాలి. హత్తుకోవాలి. అది ట్రాన్స్‌పరెంట్ చీకటై వుండాలి. నిన్ను పలికరించాలి' – తిలక్ (అమృతం కురిసిన రాత్రి)
7. అనుభూతి అంటే సానుభూతికి పైరూపం. సానుభూతే రసానందంగా మారి చైతన్యపూరితమైన జ్ఞానాన్ని కల్గిస్తుంది. అనుభూతి కవిదెప్పుడూ సౌందర్య దృష్టి. మానవుణ్ని మానువునిగా ఉంచటం అనుభూతి కవిత్వ ప్రయోజనం[2] ముదిగొండ వీరభద్రయ్య.

---

1. ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు, పుట xvii - xviii)
2. అనుభూతి కవిత్వం స్వరూప స్వభావ ప్రయోజనాలు, భారతి, సెప్టెంబరు, 1982.

8. అనుభూతిని గురించి బోయి భీమన్న అభిప్రాయాలు ఈ విధంగా వ్యక్తమవు తున్నాయి.

ఆత్మలో కలిసిపోయిన అనుభవసారమే అనుభూతి. అనుభూతి జాగృతం కావటమే భావ స్పర్శ. అటువంటి అనుభూతి రససంబంధి అయినప్పుడు కళాసృజన జరుగుతుంది.

అనుభూతి సంస్కారంతో కూడుకున్నది. అది పుట్టుక నుంచే ఉంటుంది.

ఒక అపూర్వ పరిచయం అవ్యాజ స్నేహంగా మారి, కవిలో మేల్కొల్పిన ఒక విశిష్ట రసానుభూతికి సాహితీరూప కల్పనే అనుభూతి కవిత్వం.

సామాన్యుని అనుభవం సుఖం. సహృదయుని అనుభవం రసం. కవి అనుభవం కావ్యం. యోగి అనుభవం పరమైక్యం ఈ అన్నీ కలిసిన అనుభవం బోయి భీమన్నది. –మణిమానసం,పుట xi, xiii

అనుభూతులకు అక్షరరూప కల్పన చేసి 'కవిత్వం కోసం కలం పట్టిన సరికొత్త తరం ప్రతినిధి' ఇంద్రగంటి శ్రీకాంత శర్మ. 'క్షితిజ రేఖపై ఇద్దరు'[1] కవితలో భావకవులు స్వప్న కాల, స్వప్నలోకాల పరిణామంలో స్వాంతశోధనపై ఒకడు భావి నుండి దివికి ప్రయాణమయ్యాడు. మరొక అభ్యుదయ కవి వాస్తవలోకాల జనజీవన వేదనాకీలల మధ్య మానవతాసాధనకై భావి నా ఉజ్జ్వల నేత్రమంటూ రోదసినుండి భువికి బయలుదేరాడు. వారెన్నుకున్న వస్తువును బట్టి మార్గాన్వేషణ.

'కవిత్వం అంతరాంతర జ్యోతి సీమల్ని బహిర్గతం చెయ్యాలి, విస్తరించాలి. చైతన్య పరిధి అగ్ని జల్లినా అమృతం కురిసినా అందం, ఆనందం దాని పరమావధి అని తిలక్ అనుభూతిని నిర్వచిస్తే

'ఒకానొక అనుభవం నీలో ఘనీభవించే మౌక్తికక్షణం'[2] అనుభూతి, ఆ అనుభూతి పాఠకునిలోను కలిగిస్తుంది.

1. అనుభూతి గీతాలు, ఇంద్రగంటి శ్రీకాంత శర్మ, నవోదయ పబ్లిషర్స్, 1976, పుట 12.
2. ఇంద్రగంటిశ్రీకాంతశర్మ, స్పర్శ, అనుభూతి గీతాలు, పుట 52.



ఉదయించే నవలోకం నీదేనని ఆధునిక కవులు విభిన్న దృక్పథాలను వ్యక్తం చేసారు. గుంటూరు శేషేంద్ర శర్మ కవితారంగంలో వచ్చిన మార్పులను, రచయితల దృష్టిలో కనుమరుగైన ప్రకృతి సౌందర్యాన్ని తలచి వస్తు తత్త్వాన్ని, కవితా తత్త్వాన్ని, భావనాప్రపంచాన్ని ఆధునిక మహాభారతంగా మలిచారు.

సముద్రమైన మనిషిలో నుంచి
సత్యం ఎండిపోవడం చూస్తే
ధరిత్రి మీద
సముద్రాలు ఎండిపోతాయని
భయమేస్తోంది.
వృక్షాలు పుష్పవతులై
నడిచే రోజు
రాదని భయమేస్తుంది[1]. – నా దేశం నా ప్రజలు

ప్రకృతిలో తాదాత్మ్యం పొందే గుణం లోపించటం నేటి ఆధునిక కవుల రచనల పరిస్థితి 'వస్తువులో వస్తువు చూచే నయనం' కావాలంటారు కవి.

'నీకు రెక్క లివ్వడానికే నిద్రపోకుండా మేలుకో ఉంది నా కిటికీ' అని శేషేంద్ర తమ్మ లక్ష్యాన్ని నిర్దేశించారు. ఇది గొర్రిల్లా యుగమని, మనకోసం నిరీక్షిస్తున్న తరుణపు బ్రహ్మరాక్షస పరిమాణాలు అందుకుందామని భావితరానికి సందేశాన్నిచ్చారు. కాల స్వభావాన్ని వివరిస్తూ 'చూచావా–కాలం చేతుల్లో దేవతల

1. గుంటూరు శేషేంద్ర శర్మ, ఆధునిక మహాభారతం, ఇండియన్ లాంగ్వేజస్ ఫోరమ్, హైదరాబాదు, 1993, పుట 193.

రూపాలు కూడ మారిపోతాయి' అని 'కాలం చక్రం తిరిగి తిరిగి జీవితాన్ని క్రాసుగా మనిషిని క్రైస్తుగా మలిచిన ఈ రోజు' అసత్యాన్ని శిలువకు పంపిస్తున్నాడు. వర్తమానం నిష్ఫలమవుతూ నిద్రిస్తోందని, ఒక యుగానికి ఉద్వాసన చెప్పవలసి వస్తుందనే భావాన్ని వ్యక్తం చేసారు.

పరగు కృష్ణమూర్తి, ఇరవై ఒకటవ శతాబ్దంలో భారతదేశం అభివృద్ధి చెందుతుందని భావించారు. కోటి కోటి విచారాలు పోటీపడే క్షణంలో రాబోయే ఇరవై ఒకటవ శతాబ్దం గురించి కవి సుందర స్వప్నాన్ని కన్నాడు.

"నా దేశము పూవులలో నడకలు సాగించాలని స్వప్న మొకటి చూస్తున్నా"[1]

నా దేశం ధర్మరథమై, కర్మరథమై వైకుంఠము పాతాళము వరకు పెరిగిపోతున్నదని భవిష్యత్తును ఉజ్జ్వలంగా దర్శించారు.

నిన్న, నేడు, రేపు వేరువేరు. అంతా ఒకటను కోవడం పొరపాటు. లోచూపు లేకపోవటమే దానికి కారణమంటారు శ్రీనాథ్.

"నిన్ననీ నేటినీ ప్రతిమా గృహంలో నిలబెట్టి
రేపటి కోసం ఆలోచిస్తేనే
మనిషికి మనుగడ".[2]

1. సంపాదకులు, తంగిరాల సుబ్బారావు, ఆర్వియస్. సుందరం, చైతన్య కవిత, చైతన్య కవితా వేదిక, మైసూరు, పుట 49.
2. సంపాదకులు, తంగిరాల సుబ్బారావు, ఆర్వియస్. సుందరం, చైతన్య కవిత, చైతన్య కవితా వేదిక, మైసూరు, పుట 50.



జూకంటి జగన్నాథం 'సంధికాలం'లో సమస్త విలువలు నశిస్తాయని ప్రపంచీకరణ నేపథ్యంలో

'పురుషుడు ఒక వస్తువు పెండ్లాం ఒక చెక్‌బుక్
పిల్లలు ఒక వ్యాపారపు చేను
డబ్బుతో సుఖాన్ని ఖరీదు చేస్తావు"[1] – సంధికాలం

పెట్టుబడిదారీ సమాజం వలన భవిష్యత్తులో మానవ సంబంధాలు పడిపోతాయని భవిష్యత్తులో విప్లవోద్యమాలు ఉప్పెనలుగా లేస్తాయని సూచించారు జూకంటి జగన్నాథం.

1. సంపాదకుడు పాపినేని శివశంకర్, కవితా ఓ కవితా తెలుగు వచన కవితా సంకలనం (1981–90) పెనుగొండ లక్ష్మీనారాయణ, పల్లవి పబ్లికేషన్స్, విజయవాడ, 1994.